

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## మహానాడు ఏర్పాట్లపై ఎంపీ వేమిరెడ్డి సమీక్ష

**ఇస్కా కిసాన్ సెజ్‌లో విస్తృత పరిశీలన**

**27 నుంచి 29 వరకు జరిగే మహానాడుకు వేగంగా పనులు చేయాలని సూచనలు**



**కొడవలూరు, మే 7, ప్రభాతవార్త :** మండలంలోని ఇస్కా కిసాన్ సెజ్‌లో మే 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న తెలుగు మహానాడు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గురువారం క్షుణ్ణంగా పరిశీలించారు. మహానాడు వేదిక, సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ ఏర్పాట్లు, రహదారుల మరమ్మతులు, భద్రతా చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర స్థాయి నాయకులు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో ప్రతి ఏర్పాటును సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. మహానాడు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే సభా ప్రాంగణంలో పరిశుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల నిల్వ, తాత్కాలిక వసతి, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు తెలిపారు. ఈ పరిశీలనలో సీఎం కార్యక్రమాల సమన్వయకర్త మంతెన సత్యనారాయణ రాజు, శాసన మండలి సభ్యుడు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మలిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, మే 7, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 0క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 56.197 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 0, ఎన్‌ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టా 5000 క్యూసెక్కు ల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 97.417 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో ఆకట్టుకున్న ఛాంపియన్ ఫార్మర్స్ బుక్ లెట్




**నెల్లూరు కలెక్టరేట్, మే 7, ప్రభాతవార్త** ఛాంపియన్ ఫార్మర్స్ పేరుతో బెస్ట్ పాలసీని గతంలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో ప్రజెంట్ చేసిన నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఛాంపియన్ ఫార్మర్స్ అమలు విధానాన్ని వివరిస్తూ బుక్ లెట్ నెల్లూరు కలెక్టర్ రూపొందించారు రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా ఛాంపియన్ ఫార్మర్స్ పాలసీని ,దీంట్లో అమలు చేయడం జరిగింది ఛాంపియన్ ఫార్మర్స్ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేలా మార్గదర్శకాలు ప్రభుత్వం విడుదల చేసింది.

## ప్రత్యేక నోడల్ అధికారిగా ,జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, మే 7, ప్రభాతవార్త** గురువారం సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్లు సదస్సు 4.7 భాగంగా బెస్ట్ ప్రాక్టీసెస్‌లో గుర్తించిన తొమ్మిది విభాగాలకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లను ల్యాండ్ డిస్ప్యూటీ రిజాల్వ్ చేసే విధానికి ప్రత్యేక నోడల్ అధికారిగా నియమించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ లిటిగేషన్ లేకుండా భూవివాదాలను పరిష్కరించే చతురత, మాటకరితనం హిమాన్షు శుక్ల సొంతమని దానిని గుర్తించి ప్రత్యేక నోడల్ అధికారిగా నియమించడం జరిగిందన్నారు. గుర్తించిన తొమ్మిది విభాగాలలో బెస్ట్ ప్రాక్టీస్ ను అమలుపరిచేందుకు జిల్లా కలెక్టర్లను నోడల్ అధికారులుగా నియమించడం జరిగిందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

## మైనింగ్ అనుమతులపై ప్రజాభిప్రాయ సేకరణ




**సైదాపురం, మే 7 ప్రభాతవార్త** మండల కేంద్రమైన సైదాపురం పంచాయతీ పరిధిలోని మొలకలపూండ్ల రెవెన్యూ పరిధిలోని తెల్లబోడు మైనింగ్ సమీపంలో నెల్లూరు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సమక్షంలో గురువారం మైనింగ్ అనుమతులపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొలకలపూండ్ల, చాగణం గ్రామంలోని సర్వే నెంబర్లు 528, 505, కంపార్టుమెంట్ మెంబర్ (107, 108)లో ఓపెన్‌కాస్ట్ పద్ధతిలో సుమారు 10.02 హెక్టార్ల విస్తీర్ణంలో మైనింగ్ నిర్వహించేందుకు కృష్ణ మైనింగ్ కంపెనీ వారు ప్రభుత్వ అనుమతులు కొరకు దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం జరిగిందని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజాభిప్రాయాన్ని సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపడం జరుగుతుందని, అందుకు అనుగుణంగా మైనింగ్ అనుమతులు ప్రభుత్వం ద్వారా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్, తహసీల్దార్ ఎం.సుభద్ర, కృష్ణమైనింగ్ కంపెనీ యాజమాన్యం గోగినేని భరత్, ఎన్జీవోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయి అంకురార్పరణ కార్యక్రమంలో

**పాల్గోన్న కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



**బుచ్చి మే 7 ప్రభాతవార్త** శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు ప్రారంభం సందర్భంగా గురువారం రాత్రి అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపాల్గోన్నారు. ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఆలయ ఇఒ ఆర్వభూమి శ్రీనివాసులరెడ్డి, కమీటి సభ్యులు,అర్చకులు ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆంకురార్పణ కార్యక్రమంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు బ్రహ్మోత్సవాలు విజయవంతం జరగాలని కాంక్షిస్తున్నట్లు తెలిపారు.దేవాలయం అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. అంకుర్పారణ కార్యక్రమానికి నెల్లూరుకి చెందిన కోండా మల్లికార్జునరెడ్డి- లక్ష్మీ, దంపతులు , వెంకట్‌రామ్- వైష్ణవి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహారించి పూజా కార్యక్రమాలు పాల్గోన్నారు.దేవస్దాన చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులరెడ్డి, పాలక మండలి సభ్యులు నక్కల శివకృష్ణ, జొన్నలగడ్డ వరలక్ష్మీ, కీలుకుప్ప శ్రీనివాసులు, సూరాయపాళెం ప్రతూషా, ముంగర సుధాకర్, రామాయణం సుధారాణి, దేవదాయశాఖ సిబ్బంది, వేదపండితులు పాల్గోన్నారు.

## నెల్లూరులో అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

**- రూ. 6 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం**




**నెల్లూరు క్రైమ్, మే 7, ప్రభాతవార్త** లిఫ్ట్ ఇస్తామంటూ నమ్మించి దోపిడీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను చిన్నబజార్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల నుంచి నగదుతో పాటు కారు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర ఏఎస్పీ దీక్ష వెల్లడించారు. ఆమె తెలిపిన సమాచారం మేరకు ఈ నెల 2వ తేదీ తెల్లవారు జామున సుమారు 2 గంటల సమయంలో నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఒక వ్యక్తి చిట్వేల్ వెళ్లేందుకు వేచి ఉండగా, స్విఫ్ట్ డిజైర్ కారులో వచ్చిన నలుగురు నిందితులు తాము కడప వెళ్తున్నామని నమ్మించి అతడిని కారులోకి ఎక్కించుకున్నారు. కొంతదూరం వెళ్ళాక కత్తితో బెదిరించి, బాధితుడి వద్ద ఉన్న రూ.7,200 నగదు, మొబైల్ ఫోన్‌ను లాక్కొని అతడిని కారులో నుంచి బయటకు నెట్టేసి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు, టౌన్ ఏఎస్పీ దీక్షా ఐపీఎస్ పర్యవేక్షణలో, సీఐ సిహెచ్. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. బుధవారం సాయంత్రం పొదలకూరు రోడ్డులోని దొంతాలి క్రాస్ రోడ్ వద్ద నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిరుపతికి చెందిన సుంకర మోహిత్ సాయి, చంద్రగిరికి చెందిన సురిటి జయకుమార్, పులివెందులకు చెందిన పాలూరి రాజ, ఒంగోలుకు చెందిన మాదిరె వెంకట రమణారెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుండి దోపిడీకి గురైన రూ. 7,200, తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన స్విఫ్ట్ డిజైర్ కారు, వేదాయపాలెం పరిధిలోని శ్రీలంక కాలనీలో జరిగిన దొంగతనానికి సంబంధించి 22.23 గ్రాముల బంగారు ఆభరణాలు, 50 గ్రాముల వెండి వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ. ఆరు లక్షలుగా నిర్ధారించారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన చిన్నబజార్ ఇన్స్పెక్టర్ సి.హెచ్. కోటేశ్వరరావు, ఎస్సై ఏ. అయ్యప్ప, ఇతర కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## అల్లూరి సీతారామరాజు త్యాగస్ఫూర్తి యువతకు ఆదర్శం

**- జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల**



**నెల్లూరు క్రైమ్, మే 7, ప్రభాతవార్త** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు వర్ధంతి సందర్భంగా గురువారం ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అల్లూరి సీతారామ రాజు దేశ స్వాతంత్రం కోసం గిరిజన ప్రజలను ఏకం చేసి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ధైర్యసాహసాలతో పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఆయన త్యాగస్ఫూర్తి, దేశభక్తి నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది కూడా ఆయన సేవా భావం, క్రమశిక్షణను ఆదర్శంగా తీసుకొని ప్రజల భద్రత కోసం నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ సిహెచ్. సౌజన్య, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు తదితర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మొలక పోలేరమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి




**ముత్తుకూరు, మే 7, ప్రభాతవార్త** కృష్ణాపట్నం గ్రామ దేవతైన మొలక పోలేరమ్మను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గురువారం దర్శించుకున్నారు. స్థానిక టిడిపి నాయకులు రాగాల శివకృష్ణ, దేవస్థానాల ఛైర్మన్ మామిడాల శ్రీనివాసులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 సంవత్సరాలు తర్వాత గ్రామస్తులు అందరూ కలిసి అమ్మవారి జాతర జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయ ధర్మకర్త, ఛైర్మన్‌తో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈదూరు రామ్మోహన్ రెడ్డి, రవికుమార్ రెడ్డి, పసుపులేటి గోవిందరయ్య, ఏకుల మురళి బాబు, బొనిగి ఆనందయ్య, అమ్మవారి దేవస్థానం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో విద్యారంగంలో వినూత్న మార్పులు




**నెల్లూరు , మే 7 ప్రభాతవార్త విద్య** తమ వైయస్సార్సీపీ పాలనలో విద్యారంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టడం జరిగిందని ఎమ్మెల్సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పెర్కొన్నారు . గురువారం నగరంలోని స్తానిక వైకాపా నగర కార్యలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు . ఈ సందర్బంగా ఆయన మాట్లడుతూ పేదల పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదువుతుంటే కూటమి నాయకులు కళ్లల్లో నిప్పులు పోసుకున్నార న్నారు. నాడు ఇంగ్లిష్ మీడియం వ్యతిరేకించిన వాళ్లంతా హైకోర్టు వ్యాఖ్యలను ఖండించగలరా అని ప్రశ్నించారు. ప్రణాళిక ప్రకారం తమ పార్టీ అదినేత వైయస్ జగన్ గారి మీద విష ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. కూటమి పాలనలో పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఆర్వో వాటర్ ప్లాంట్లు పనిచేయడం లేదని ఎద్దేవా చేసారు. కనీసం నాణ్యమైన మధ్యాహ్న భోజనం కూడా ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు. పేద పిల్లలకు చదువులు దూరం చేసే కుట్ర జరుగుతోందని వైయస్ జగన్ ఐదేళ్ల కృషి వల్లే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు వచ్చాయన్నారు. పత్రికల్లో ప్రకటనలు ఇచ్చుకున్నంతా మాత్రాన ఆ క్రెడిట్ కూటమి ప్రభుత్వానికి రాదన్నారు. ఉద్యోగులకు రావాల్సి న బకాయిలపై వెనక్కి తగ్గాల్సి న అవసరం లేదని అందరూ సంఘటితమై పోరాడాలని పిలువునిచ్చారు. పీఆర్సీ, డీఏ, ఐఆర్‌లపై ప్రశ్నించకుండా జీతాలు తగ్గిస్తామని బ్లాక్‌మెయిల్ చెయడం సరికాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లింట్లో విషాదం.. గ్యాస్ సిలిండర్ పేలుడుతో అగ్నిప్రమాదం

**రూ.2 లక్షల నగదు, బంగారం దగ్ధం**

**వీధినపడిన బాధిత కుటుంబం**



**కొడవలూరు, మే 7, ప్రభాతవార్త :** మండలంలోని తలమంచి గ్రామంలో షేక్ కరీమునిషా పూరీ ఇంట్లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుని తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. శుక్రవారం ఆమె కుమారుడి వివాహం జరగనున్న నేపథ్యంలో ఇంట్లో పెళ్లి ఏర్పాట్లు జరుగుతుండగా గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వివాహ వేడుక కోసం బంధుమిత్రులతో సందడిగా ఉండాల్సి న ఇంట్లో క్షణాల్లోనే అగ్నికీలలు వ్యాపించడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సమాచారాన్ని స్థానిక అధికారులు కూడా తెలుసుకుని ఘటనపై ఆరా తీశారు. అయితే అప్పటికే ఇంట్లో ఉన్న సుమారు రూ.2 లక్షల నగదు, బంగారు ఆభరణాలు, వివాహానికి సిద్ధం చేసిన వస్త్రాలు, గృహోపకరణాలు సహా పలు విలువైన సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో బాధిత కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. సమాచారం తెలుసుకున్న స్థానిక టిడిపి నాయకులు జొన్న శివకుమార్, గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చి, అవసరమైన సహాయం అందిస్తామన్నారు. పెళ్లి శుభకార్యం జరగాల్సి న ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



## అక్రమ రేషన్ బియ్యం తరలింపు లారి పట్టివేత



**జలదంకి, మే 7, ప్రభాతవార్త** జలదంకి మండలం తొమ్మిదోమైలు వద్ద 167 జాతీయ రహదారిపై అక్రమంగ రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ లతీపున్నీష కదనం మేరకు గురువారం కలిగిరి సిఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్ఐ సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈసందర్బంగ మండల పరిదిలోని హనుమకొండపాళెం నుంచి కావలి వైపు వెళుతున్న లారిని పరిశీలించగ రేషన్‌బియ్యం బస్తాల బాగోతం బయటపడింది.దీంతో డ్రైవర్‌ను పలు కోణాలలో ప్రశ్నించి లారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ వివరించింది.

## శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయి బ్రహోత్మవాలకు

**బీదాను, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఆహ్వానించిన చైర్మన్ అశోక్‌రెడ్డి**



**బుచ్చి, మే 7, ప్రభాతవార్త** శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి బ్రహ్మోత్సవాలకు రాజ్యసభ సభ్యులు బీదామస్తాన్‌రావు, నెల్లూరు పట్టాణాభివృద్ధి సంస్థ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డిని ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఆలయ ఇఒ ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డి కమీటి సభ్యులు నక్కల శివకృష్ణ కలిసి మర్యాదపూర్వకంగా వారిని సత్కరించి బ్రహోత్మవాలకు ఆహ్వానించారు. 7 నుండి బ్రహ్మోత్సవాలు 17 వ తేది వరకు వేడుకగా జరుగుతాయని వారు తెలియజేశారు. శ్రీమల్లికార్జునస్వామి వారిని కామాక్షితాయిని దర్శించుకొని వారి కృఫకు పాత్రలు కావాలని పిలుపునిచ్చారు.



## అట్టహాసంగా ప్రారంభమైన

## 13వ అంతర్ జిల్లా, రాష్ట్ర స్దాయి బీచ్ కబడి ఛాంపియన్‌షిప్ పోటీలు

**ముఖ్య అతిథులుగా పాల్గోన్న కైవల్యారెడ్డి, బీదా మస్తాన్‌రావు**





**సంగం మే 7 ప్రభాతవార్త** సంగం మండలం దువ్వూరు గ్రామంలో జరుగుతున్న 13వ అంతర్ జిల్లాల రాష్ట్రస్దాయి బీచ్ కబడీ చాంఫియన్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుమార్తె కైవల్యారెడ్డి, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు ముఖ్య అతిధిగా పాల్గోన్నారు. ఈకార్యక్రమంలో కైవల్యారెడ్డి మన ఆత్మకూరు నియోజకవర్గంలోని దువ్వూరు గ్రామంలో 13 వ అంతర్ జిల్లాల రాష్ట్రాస్దాయి బీచ్ కబడీ చాంపియన్‌షిప్ జరగడం ఎంతో ఆనందదాయకంగా ఉందని అన్నారు. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల నుండి పురుష, మహిళా క్రీడాకారులు పాల్గోని తమ ప్రతిభను ప్రదర్శించడం మనందరికి గర్వకారణమని అన్నారు. కబడీ మన భారతదేశానికి చెఇందిన అత్యంత పురాతనా,సాంప్రదాయ క్రీడాలలో ఒకటి గ్రామీణస్దాయి నుండి ప్రారంభమైన ఈ క్రీడ,నేడు జాతీయ అంతర్జాతీయ స్దాయికి ఎదిగి దేశ గౌరవాన్ని పెంచుతుందని అన్నారు. 1990 నుండి ఆసియా క్రీడల్లో అధికారిక క్రీడగా గుర్తింపు పొందిన కబడీ,ప్రో కబడీ లీగ్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా మరింత ప్రాచుర్యం పొందిందచి అన్నారు. నాలుగు రోజులు పాటు జరిగే ఈ పోటీలలో పాల్గోనే క్రీడాకారులకు వసతి బోజనం మరియు ఇతర అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరిగిందని అన్నారు. క్రీడలంటే ,క్రీడాకారులన్నా మా తండ్రి ఆనం రామానారాయణరెడ్డికి అమితమైన అభిమానం అని ఆమె చెప్పారు. రాజకీయ, వ్యక్తిగత జీవిత ప్రారంభం నుండే జిల్లా బలింపిక్ అసోసియేషన్ అద్యక్షులుగా,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పోర్ట్స్ అధారిటి చైర్మన్‌గా క్రీడారంగానికి విశేష సేవలు అందించారని ఆమె తెలిపారు. నెల్లూరులో ప్రతిష్టాత్మకమైన ఏసి సుబ్బారెడ్డి స్పోర్ట్స్ స్టేడియం లాగే ఆత్మకూరులో రూపు దిద్దుకుంటున్న నూతన స్పోర్స్ట్ స్టేడియం ఏర్పాటులో ఆయన దూరదృష్టి కృషికి ప్రత్యేక నిదర్శనంగా నిలిచాయని అన్నారు. ఈపోటీలలో ప్రతి క్రీడాకారుడు క్రమశిక్షణతో క్రీడా స్ఫూర్తితో ఆడి విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ బీచ్ కబడీ చాంపియన్ షిప్ మన రాష్ట్రానికి మన దేశానికి మంచి పేరు తీసుకొని రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు మాట్లాడుతు మారుమూల గ్రామాలలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రోద్బలతో ఇంత ఎత్తున రాష్ట్రస్దాయి కార్యక్రమం చేపట్టడం హర్షణీయమని అని అన్నారు. 26 జిల్లాల నుండి కబడీ క్రీడాకారులు పోల్గోనడం శుభ పరిణామని అన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు మండల పార్టీ అద్యక్షులు బాణా శ్రీనివాసులరెడ్డి,సొసైటీ చైర్మన్ గుండ్ల పల్లి శ్రీనివాస్‌యాదవ్, దువ్వూరు నాయకులు దయాకర్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు భీమతాటి వెంకటరమణయ్య, పలువురు పిఇటిలు పాల్గోన్నారు. కబడీ క్రీడాకారులు, నిర్వాహకులు పెద్దఎత్తున పాల్గోన్నారు.

# అంగన్‌వాడీలలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



**చేజర్ల, మే 7, ప్రభాతవార్త :** ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని చేజర్ల మండలంలో ఖాళీగా ఉన్నటువంటి అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్టు సీడీపీవో పి.సునీలత గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త- 1, హెల్పర్లు-3 ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్త చీర్ల వారి కండ్రిక గ్రామంలో ఓసీ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే అంగన్‌వాడీ హెల్పర్లుగా తూర్పు కంభంపాడు ఓసీ, కాకివాయి గ్రామం ఓసీ, కాలాయపాలెం గ్రామం బీసీ-బి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 7వ తేదీ నుండి 25వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణత అయి ఉండాలన్నారు. జులై 1, 2026 నాటికి 21 సంవత్సరం నుండి 35 సంవత్సరాల లోపు వయసు ఉండాలన్నారు. స్థానిక వివాహిత మహిళ అయి ఉండాలని తెలియజేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అన్ని అర్హతలు కలిగిన అభ్యర్థులను పారదర్శకంగా ప్రభుత్వ నిబంధన ప్రకారం ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

# కేకేగుంటలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



**దగదర్తి, మే 7, ప్రభాతవార్త :** దగదర్తి మండల ప్రాంతమైన కేకేగుంట గ్రామ పంచాయతీలోవాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం జరిగింది. పంచాయతీలో నీటి వసతి లేక ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలకు కేకేగుంట నాయకులు అంబటి రమేష్ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు దృష్టికి తీసుకుపోగా స్పందించిన ఆయన తన నిధులు నుంచి రూ.7.5లక్షల వాటర్ ప్లాంట్‌కు ఇచ్చారు. వాటర్ ప్లాంట్ పనులు పూర్తి చేసి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ బేబి శిరోమణి, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. కేకేగుంట గ్రామ ప్రజలు బీద మస్తాన్‌రావుకి కృతజ్ఞతలు తెలిపారు.

# కోళ్ల లారీ బోల్తా




**దగదర్తి, మే 7, ప్రభాతవార్త :** అల్లూరు రోడ్డు జాతీయ రహదారి వద్ద కోళ్ల తీసుకొని వెళ్తున్న లారీ బోల్తా పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. దగదర్తి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నుంచి చీరాలకు కోళ్లను తీసుకుని వెళ్తున్న లారీఅల్లూరు రోడ్డు బ్రిడ్జి వద్ద బోల్తా పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చేశారు. లారీలో ఉన్న వ్యక్తులకు ఎటువంటి ప్రమాదం జరగలేదని, కోళ్ల 500లకు పైగా చనిపోయాయని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

# అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం



**ఇందుకూరుపేట, మే 7, ప్రభాతవార్త :** మహిళా శిశు సంక్షేమ శాఖ ఇందుకూరుపేట ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందుకూరుపేట, ముత్తుకూరు, టీపీ గూడూరు మండలాల్లో మొత్తం 39 పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రాజెక్టు పరిధిలోమూడు విభాగాల్లో పోస్టుల భర్తీజరగనుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు -1 పోస్టు(ఇందుకూరుపేట), మినీ అంగన్‌వాడీకార్యకర్తలు-2 పోస్టు లు(ఇందుకూరుపేట 1,ముత్తుకూరు-1), అంగన్ వాడీసహాయకురాళ్ల మొత్తం 36పోస్టులు ముత్తుకూరుమండలం-13, టీపీ గూడూరు -7, ఇందుకూరుపేట-16 పోస్టులు ఖాళీలున్నాయన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా 10వ తరగతి పాసై ఉండాలని, వయస్సు 01-07-2026 నాటికి 21 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. అభ్యర్థులు సంబంధిత గ్రామం లేదా వార్డు నివాసితులై ఉండటం తప్పనిసరి అన్నారు. దరఖాస్తు ప్రక్రియ 7వ తేదీ నుండి ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ధృవపత్రాలతో సంబంధిత ఐసీడీఎస్ కార్యాలయంలో మే25, 2026 సాయంత్రం లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు.

# కిమ్స్ హాస్పిటల్ నెల్లూరులో మాతృశిశు సంరక్షణలో కొత్త అధ్యాయం

**- అత్యాధునిక సదుపాయాలతో కిమ్స్ కడిల్స్ విభాగం - మే 9న గొప్ప ప్రారంభం**

**నెల్లూరు, మే 7, ప్రభాతవార్త-వైద్యం :** కిమ్స్ హాస్పిటల్, నెల్లూరులో మాతృ, శిశు ఆరోగ్య సేవలకు మరింత నాణ్యతను తీసుకురావడానికి కిమ్స్ కడిల్స్ ఈనెల 9న ప్రారంభం కానుంది. కిమ్స్ హాస్పిటల్స్‌కి చెందిన ఈ ప్రత్యేక మదర్ అండ్ చైల్డ్ కేర్ సెంటర్, ఆధునిక వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్యులతో సేవలు అందించడానికి సిద్ధమవుతోంది. సురక్షిత ప్రసవాలకు నూతన ప్రమాణాలు ప్రస్తుత హైరిస్క్ గర్భధారణలు, నవజాత శిశు సంరక్షణకు ప్రత్యేక వైద్య సేవల అవసరం పెరుగుతోంది. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కిమ్స్ కడిల్స్ అందించబోయే సేవలు హైరిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్‌మెంట్, ఆధునిక ఎన్ఐసీయు(నియోనేటల్ ఐసీయూ), 27/7 అత్యవసర సేవలు, డాక్టర్ వాసుదేవ్(పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్),డాక్టర్ పవన్ సత్యం(పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్), డాక్టర్ మురార్జి (పీడియాట్రిక్ ఇంటెన్సి విస్ట్),డాక్టర్ మోహన సాయి రూప, డాక్టర్ రేఖ రెడ్డి, డాక్టర్ మంజూష(అనుభవజ్ఞులైన గైనకాల జిస్టులు),డాక్టర్ ఎం.వెంకట్ నవీన్, డాక్టర్ భార్గవ్(నవజాత శిశు వైద్యులు), ఆధునిక సదుపా యాలు-ఆత్మీయ సంరక్షణ, తల్లి, శిశువు సురక్షితంగా ఉండేందుకు ఆధునిక లేబర్ రూమ్స్, అత్యాధునిక పరికరాలు, కఠినమైన భద్రతా ప్రమాణాలతో ఆసుపత్రి రూపుదిద్దుకుంది. ప్రతి కుటుంబానికి ఆత్మీయమైన వాతావరణంలో సేవలు అందించడమే లక్ష్యం. ప్రతి తల్లి, శిశువుకు సురక్షితమైన చికిత్స అందించడం మా లక్ష్యం. స్థానిక వైద్యులతో కలిసి పని చేసి మెరుగైన ఫలితాలను సాధించాలనుకుంటున్నాం అని కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్- చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ బి.భాస్కరరావు తెలిపారు. కిమ్స్ కడిల్స్ అధికారిక ప్రారంభోత్సవం మే 9న జరగనుంది. ప్రముఖ వైద్యులు, అతిధులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కిమ్స్ కడిల్స్ ప్రారంభం ద్వారా నెల్లూరు, పరిసర ప్రాంత ప్రజలకు అత్యుత్తమ మాతృశిశు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నాం అని అవసరమైన వారు ఈ ప్రత్యేక, ఆధునిక వైద్య సేవలను వినియోగించుకోవాలని కిమ్స్ యాజమాన్యం చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ బి.భాస్కరరావు తెలియజేశారు.

# మహా కుంభాభిషేకమునకు 10116రుపాయలు అందజేత



**కావలి, మే 7 ప్రభాతవార్త :** కావలి కచేరిమిట్టలో వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ మూల బింబ పునఃప్రతిష్ఠ, మహా కుంభాభిషేకములకు గానూ సీనియర్ జర్నలిస్ట్ స్వర్గీయ ఏబివి.నరసింహారావు, వారి సతీమణి స్వర్గీయ కమల కుమారిల జ్ఞాపకార్థం వారి కుమారులు అన్నలూరు శ్రీదర్, అన్నలూరు వల్లినాథ్‌లు రూ.10,116లు దేవస్థానం కమిటీ సభ్యులు తిరువీదిబ్రహ్మయ్యకు అందజే యడం జరిగింది. సద్భావన సాధన వ్యవస్థాపక అధ్యక్షులు గణపతిరాజు మారుతీ రామారావు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ముత్తు మారి అమ్మవారికి గంగాభిషేకం



**నెల్లూరు రూరల్ మే 7 ప్రభాతవార్త :** , శ్రీ ముత్తు మారి అమ్మన్ దేవస్థానం లో నిర్వహి స్తున్న అమ్మవారి వార్షిక ఉత్స వాలు భక్తుల కోలాహలంతో ఘన ంగా కొనసాగు తున్నాయి. ఉత్స వాల్లో భాగంగా గురువారం గాదం రోశ య్య నగర్లోని సుబ్ర మణ్య స్వామి ఆలయం నుండి 108 కళశాలతో మహిళలు భారీశోభా యాత్రగా బయలు దేరా రు. సంప్రదాయ వాద్యాలు, మంగళహారతులు, అమ్మ వారి నామస్మ రణల మధ్య సాగిన ఈ ఊరేగింపు భక్తుల ను ఆకట్టుకుంది. తలపై కళశాలు ధరించిన మహిళలు భక్తిశ్రద్ధలతో నడుచుకుంటూ ముత్తు మారి అమ్మన్ దేవస్థానానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి పవిత్ర జలాలతో గంగాభిషేక కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. గంగాభిషేకం అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి నిత్యాశ పూజలు, హారతులు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు, యువకులు మరియు గ్రామ ప్రజలు విశేషంగా పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలు విద్యుత్ దీపాలతో అలంకరించబడగా, భక్తి గీతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి. నిర్వహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# మార్కెట్ సెంటర్ వద్ద ట్రాఫిక్ సమస్యపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై



ఉదయగిరి, మే 7, ప్రభాతవార్త మండల కేంద్రమైన ఉదయగిరి పట్టణంలోని మార్కెట్ సెంటర్ వద్ద నిత్యం రద్దీగా ఉన్న స్థలం అక్కడ దుకాణదారులకు ఉదయగిరి ఎస్సై మహేందర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మా ట్లాడుతూ వాహనం వచ్చి పోయేట ప్పుడు ఇరుకు రోడ్డు కాబట్టి దుకాణదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే ద్విచక్ర వాహనాలు ఎదురు వచ్చేటప్పుడు సైడు మార్జిన్ చూసుకుని ఇవ్వాలని ఆయన వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దుకాణదారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాలిం ఏ హునస్ కార్యక్రమం




**నెల్లూరు, మే 7, ప్రభాతవార్త-వైద్యం :** కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో మైనార్టీ వెల్ఫేర్ మినిస్టర్ ఎన్ఎండీ ఫరూక్ సహకారంతో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సారధ్యం ముస్లిం పేద బిడ్డల ఉన్నతి కోసం నిర్వహించిన కార్యక్రమం తాలిం ఏ హునస్ ఈ కార్యక్రమం ద్వారా ఈ సమాజంలో ముస్లిం సామాజిక వర్గాలు ఉన్నత స్థాయిలో వెళ్లాలని పేద ముస్లిం బిడ్డలకు ఉన్నత చదువులు చదవాలని రాబోయే రోజుల్లో ముస్లిం సమాజం గౌరవంగా బతకాలని ఒక మంచి మనసుతో నిర్ణయించిన కార్యక్రమం తాలిం ఏ హునస్ ఈ కార్యక్రమంలో ముస్లిం సమాజం బాగుపడుతుందని కడుపు మంటతో వైసీపీ నాయకులు ఈ తాలిం ఏ హునస్ కార్యక్రమాన్ని నిలిపివేసేందుకు కుట్రలు చేస్తున్నారు. ఈ భారతదేశంలో ఇమామ్ మౌజన్ జీతాలు ఇచ్చింది తెలుగుదేశం పార్టీ. దుల్హన్ పథకం ఇచ్చింది తెలుగుదేశం పార్టీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ లోన్లు ఇచ్చింది తెలుగుదేశం పార్టీ రంజాన్ తోఫా ఇచ్చింది తెలుగుదేశం పార్టీ ముస్లింలకు షాదీ ఖానా కట్టింది తెలుగుదేశం పార్టీ. 2019-24 మధ్యలో ముస్లిం మైనార్టీలకు రావాల్సిన అన్ని పథకాలను రద్దు చేసింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఈ రోజు కూటమి ప్రభుత్వంరాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు అన్ని విధాల ఆదుకుంటుంది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మొన్న హజ్ యాత్రికులకు లక్ష రూపాయలు సబ్సిడీ ప్రకటించడమే కాకుండా వాళ్లు పూర్తి చేసుకున్న తెలుగు ప్రయాణంలో వారికి సబ్సిడీ వారి అకౌంట్లో జమ చేసే మంచి కార్యక్రమం తీసుకుంది నారా చంద్రబాబునాయుడు అని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజల్లో పూర్తి స్థాయిలో ప్రజలు చీకొట్టడమే కాకుండా వారి మనుగడ కోల్పోతున్నారని భయంతో కూటమి ప్రభుత్వంపై అబద్దపు ప్రచారాలు చేయడమే పనిగా పెట్టుకున్నారు పైగా జోకర్ల చేత మీడియా సమావేశాలు పెట్టి అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. వైసీపీ రాష్ట్ర స్థాయి నేతల నుండి క్షేత్ర స్థాయిలో కార్యకర్తల వరకు ఒక ఉన్మాదుల్లాగా వ్యవహారించడం మంచి పద్ధతి కాదు, జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అయితే అబద్దాల పుట్టలా వ్యవహరిస్తున్నారు. ప్రజలు గోవర్ధన్‌రెడ్డి మాట నమ్మే పరిస్థితుల్లో లేరు రాబోయే రోజుల్లో జగన్‌మోహన్‌రెడ్డికి అలాగే జిల్లాలో గోవర్ధన్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్దంగా ఉన్నారని అన్నారు. వక్ఫ్‌బోర్డు అనేది స్వయం ప్రతిపాది గలిగిన సంస్థ ఇందులో ప్రజల కోసం ఏమైనా పని చేయాలంటే జీవో అవసరం లేదు సొంతంగా చేయవచ్చు. వైసీపీ వాళ్లు కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వక్ఫ్‌బోర్డు అడ్డుపెట్టుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. దొంగ ఎన్ఓసీ పుట్టించి వక్ఫ్‌బోర్డు ఆస్తులను దోచుకున్నారు కానీ ఈ రోజు నీతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వైసీపీ వాళ్ళు ఇకనైనా ఒక వక్ఫ్‌బోర్డు గురించి మాట్లాడే ముందు కనీసం 10 వక్ఫ్ యాక్టులు చదువుకుని మాట్లాడాల్సిందిగా అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబీర్ ఖాన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు హయత్ బాబా షాషా మొహిద్దిన్, అస్లాం మునీర్, అబ్దుల్ మన్సూరి పాల్గొన్నారు.

# బడి పిలుస్తోంది.. ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రుల మొగ్గు

**- గమల్లపాలెం, తట్టు గొల్లపాలెంలో ప్రత్యేక నమోదు కార్యక్రమం**



**తోటపల్లి గూడూరు, మే 7, ప్రభాతవార్త :** రాష్ట్ర విద్యాశాఖ చేపట్టిన బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తోటపల్లి గూడూరు మండలంలోని వరిగొండ గమల్లపాలెం, తట్టు గొల్లపాలెం గ్రామాల్లో గురువారం విద్యార్థుల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచే లక్ష్యంతో అధికారులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా బడి ఈడు కలిగి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య గురించి వివరించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి, విద్య ప్రాధాన్యతను తెలియజేస్తూ మానవహారం ఏర్పాటు చేశారు. గమల్లపాలెంలో ఐదుగురు విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావడంతో వారికి వెంటనే ప్రవేశాలు కల్పించారు. అలాగే ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న మరో ఐదుగురు చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల నుంచి ఒకటో తరగతిలో చేర్పించారు. దీంతో మొత్తం పదిమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారు. అదేవిధంగా తట్టు గొల్లపాలెంలో ఐదు సంవత్సరాలు నిండిన ముగ్గురు చిన్నారులను ఒకటో తరగతిలో చేర్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 డి. జయరాం నాయుడు, ప్రధానోపాధ్యాయులు ఖాదర్ భాషా, ఉపాధ్యాయులు రాఘవయ్య, ప్రకాశం రెడ్డి, రోహిణి, పర్వీన్, సీఆర్ఎంటి మల్లికార్జున్, అంగన్వాడీ సిబ్బంది భవాని, షానవాజ్, ఎస్ఎంసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు ప్రాజెక్ట్ పరిధిలోని మినీవర్కర్లు, హెల్పర్ల పోస్టుల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల



**ఆత్మకూరు,మే7,ప్రభాతవార్త:** ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న 2 మినీ వర్కర్లు, 13 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ పరిధిలోని ఐసిడిఎస్ కార్యాలయంలో గురువారం నుండి మే 25వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతిపాసై ఉండాలని, 01-07-2026 నాటికి 21 సంవత్సరాలు నిండి 35సంవత్సరాల లోపు వయసు కలిగిన వారై ఉండాలని, స్థానిక వివాహిత మహిళ అయి ఉండాలన్నారు. అవివాహితులు అనర్హులన్నారు. ఎస్సీ,ఎస్టీ ప్రాంతాల్లోని పోస్టులకు ఎస్సీలు, ఎస్టీలు మాత్రమే అర్హులన్నారు. ఎస్సీ , ఎస్టీ ఏరియాల్లోని పోస్టులకు 10వ తరగతి పాస్ అయినవారు ఎవరూ లేనిచో తదుపరి తరగతులవారు అర్హులన్నారు. 21 నుండి 35సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు ఆప్రాంతంలో లేనిచో 18సంవత్సరాలు నిండిన వారు కూడా అర్హులన్నారు. ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఏఎస్‌పేట మండలం తిమ్మానాయుడుపల్లి , చేజర్ల మండలంలోని చీర్లవారి కండ్రిక 2మినీ వర్కర్లు, ఆత్మకూరు మండలంలోని ఆరవీడు మెయిన్,ఆరవీడు ఎస్టీ, వాసిలిఎస్టీ ,వెంకట్రావుపల్లి మెయిన్, పేరారెడ్డిపల్లి మెయిన్, ఏఎస్‌పేట మండలంలోని అక్బరాబాద్,జమ్మవరం, కూనలమ్మపాడు, తాతిరెడ్డిపల్లి , సంగం మండలంలోని వీర్లగుడిపాడు,చేజర్ల మండలంలోని కాకివాయి, టికెపాడు, కాలాయపాళెంకు చెందిన 13 హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కావున అర్హులైన అభ్యర్థులు తమ పరిధిలోని ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

# అంగన్‌వాడీ కేంద్రానికి 8టేబుల్స్ బహూకరణ



**ఆత్మకూరు,మే7,ప్రభాతవార్త:** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రానికి కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులు గురు వారం 8టేబుల్స్, 10కుర్చీలు బహూక రించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారి మాదాల వెంక టేశ్వర్లు -సురేఖల మనుమరాలు వెంకటసాయి పార్థవి పుట్టిన రోజు సందర్భంగా 8టేబుల్స్, 10కుర్చీలను పాప తల్లి దండ్రులు మాదాల వినోద్-సుకన్య దంపతులు అంగన్‌వాడీ కేంద్రానికి విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత, సూపర్‌వైజర్ జి.కస్తూరి, అంగన్‌వాడీ కార్యకర్త ఎం.వేణుకుమారి, చిన్నారుల తల్లిదండ్రులు , చిన్నారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల



**అనంతసాగరం,మే7,ప్రభాతవార్త:** అనంతసాగరం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి ఎం.పద్మావతి గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 16హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై , 21నుండి 35సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని, స్థానిక వివాహిత మహిళ అయినవారు అర్హులన్నారు. 7వ తేదీ నుండి 25వ తేదీ లోపు స్థానిక ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

# వ్యవసాయ కళాశాలలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి



**ఉదయగిరి, మే 7, ప్రభాతవార్త** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో శ్రీ అల్లూరి సీతా రామరాజువర్ధంతి సందర్భంగా కళాశాల అసోసియేషన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ శ్రీ అల్లూరి సీతారామరాజు 4 జులై 1897లో ఆనాటి మద్రాసు ప్రెసిడెంట్‌లోని పాండ్రంగిలో ఒక తెలుగు కుటుంబంలో జన్మించారని, ఆయన 18 ఏళ్ల చిరు ప్రాయంలోనే సన్యాసం స్వీకరించి, 20 వ దశాబ్దం ప్రారంభంలో వలసపాలెంలో ఉన్న భారతదేశంలో గిరిజన ప్రజల నాయకుడిగా ఎదిగారని అన్నారు. తదితర విషయాలను వివరించారు. డాక్టర్ కిషన్ తేజ్, కళాశాల పరిపాలన అధికారిణి కుమారి, కమల ప్రియ, డాక్టర్ మాలిని, ఇతర బోధన సిబ్బంది పాల్గొన్నారు.

# ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్‌పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ



**మర్రిపాడు,మే7,ప్రభాతవార్త:** మర్రిపాడు మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్న అనంతసాగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి ఎం.పద్మావతి తెలిపారు. మండలంలో ఖాళీగాఉన్న టిఎన్‌పేట ,పల్లవోలు, నెర్దనంపాడు-2, సన్నువారిపల్లి , నూతల హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తుచేసుకునే అభ్యర్థులు 10వ తరగతి పాసై, 21నుండి 35సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని, స్థానిక వివాహిత అయి ఉండాలన్నారు. ప్రాజెక్ట్ కార్యాలయంలో 7వ తేదీ నుండి 25వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

# వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, మే7 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ దక్షిణాముఖ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ప్రాతఃకాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహి ంచారు. అనంతరం నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారికి పూలంగిసేవ, పల్లకిసేవ, ఊంజల్ సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉభయకర్తలుగా మాకుల విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంద్రస్వామి, భక్తులు ఉన్నారు.

# గిరిజనులపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల దౌర్జన్యం

**- కాలువ గట్టు భూముల కోసం బెదిరింపులు - ఇళ్లు కూల్చివేతలపై ఆందోళన**





**తోటపల్లి గూడూరు, మే 7, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలోని తోటపల్లి గూడూరు మండలం వరిగొండ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణ వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తోంది. చంచలరావు కాలువ, కృష్ణపట్నం కాలువ పరిధిలోని పోరంబోకు, కాలువ గట్టు భూములపై కన్నేసిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్కడ దశాబ్దాలుగా నివసిస్తున్న గిరిజన కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని ఒత్తిళ్లకు దిగుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లేఔట్‌కు అడ్డుగా ఉన్నారు అంటూ గిరిజనులను ఖాళీ చేయించాలని బెదిరింపులు చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత పాలనలో జరిగిన రీసర్వే ప్రక్రియలో ప్రభుత్వ భూములు కాగితాలపై ప్రైవేట్ స్థలాలుగా మారిపోయాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం అదే రికార్డులను ఆధారంగా చేసుకుని కోట్ల రూపాయల విలువైన భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తు న్నాయి. కాలువ గట్టు వద్ద ఎన్నో ఏళ్లుగా జీవిస్తున్న సుమారు 15 గిరిజన కుటుంబాలు ఇప్పుడు ప్రాణభ యంతో కాలం గడుపుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికే రెండు కుటుంబాల ఇళ్లను కూల్చివేశారని, మరి కొన్ని ఇళ్లను ఖాళీ చేయాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. కాలువ గట్టు ప్రాం తంలో భారీగా ప్రహరీ గోడ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చూసీచూ డనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు జరుగుతున్నా ఎలాంటి చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రజా ఆస్తులను రక్షించాల్సి న అధికారులు ఆక్రమణదారులకు అండగా నిలుస్తూ పేద గిరిజన కుటుంబాలను మాత్రం భయభ్రాంతులకు గురిచేస్తు న్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా కొంతమంది రాజకీయ నాయకుల మద్దతుతో ఈ వ్యవహారం కొనసాగుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇక గిరిజన కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. దశాబ్దాలుగా అక్కడే జీవిస్తున్నప్పటికీ విద్యుత్, తాగునీరు, రహదారి, పక్కా ఇళ్ల వంటి కనీస సౌకర్యాలు కూడా అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు నివాసాలనే కోల్పోయే పరిస్థితి రావడంతో చిన్నపిల్లలతో కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి. కాలువ పోరంబోకు భూములపై పూర్తి స్థాయి విచారణ జరిపి అసలు రికార్డులను బయటపెట్టాలని, అక్రమ ప్రహరీ గోడలను తొలగించాలని, గిరిజన కుటుంబాలకు రక్షణ కల్పించాలని వరిగొండ ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# సాయి అపర్ణను ఆదర్శంగా తీసుకోవాలి



**కోవూరు, మే7 ప్రభాతవార్త :** ఇటీవల ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా స్థాయిలో 594 మార్కులు సాధించిన సాయి అపర్ణను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలనిఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ చీకిరాల చిన్నయ్యఅన్నారు. ఈ మేరకు గురువారం కోవూరు మండలంలోని గుమ్మలదిబ్బ గ్రామానికి వెళ్లి ఆ విద్యార్థిని శాలువా, పుష్పగుచ్ఛం, మెమెంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి సౌకర్యాలు లేని ఈ ప్రాంతంలో అపర్ణ అమ్మమ్మ సుజాత సహకారంతో పదవ తరగతిలో ఇన్ని మార్కులు సాధించిన విద్యార్థి లోకానికే ఆదర్శమైందన్నారు. యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళిమోహన్ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని అపర్ణ నిరూపించిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ చీకిరాల చిన్నయ్య సౌజన్యంతో సాయి అపర్ణను శాలువా, పుష్పగుచ్ఛం, మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుజాత, స్వప్న మాధురి, ఉన్నారు.

# అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం



**ఉదయగిరి, మే 7, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో పుణ్యవతి కోరారు. నర్రవాడ ఎస్సీ కాలనీ బైరవరం హెచ్‌డబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్టులకు కొట్టాలు చెర్లోపల్లి వడ్డిపాలెం దుత్తలూరు టు పూసలకాలనీ రెడ్ల దిన్నె చింతలగుంట, దుత్తలూరు, మెయిన్ కృష్ణ గాంధీపురం రామదేవులపాడు, అలివేలు,మంగాపురంలో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన కోడలు అయి ఉండాలి అలాగే ఇరవై ఒక్క సంవత్సరాలు వయసు నుండి 35 సంవత్సరాల లోపు, కలిగి ఉండాలి ఏ సెంటర్లో ఏ కేటగిరికి ప్రభుత్వంసంబంధించి వేశారు. ఆ కులం మాత్రమే అక్కడ అప్లికేషనన వేసుకోవాలని సీడీపీవో పుణ్యవతి తెలిపారు. కార్యకర్తలు గాని ఇవ్వండి ఆయాలు కానివ్వండి పదవ తరగతిపాసై ఉండాలని తెలిపారు. అప్పర్ ఏజ్ నుండి మినహాయింపు లేదు పై పోస్టుల ఎంపిక ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు జరుగును కావున మీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఏ కులం నిర్ణయించబడినదో సదరు కులం వారు మాత్రమే అర్హులని తెలిపారు. 1.7.26కు ఇరవై ఒక్క సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. ఉదయగిరి ఏరియాలో రెండు కార్యకర్తల పోస్టులు 10ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయా గ్రామాలలో వివరించిన ప్రకారం అప్లై చేసుకోవాలని సీడీపీవో తెలిపారు.

# ఉదయగిరిలో చుక్కల దుప్పిని కాపాడారు




**ఉదయగిరి, మే 7, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరిలో కుక్కల దాడిలో గాయపడిన చుక్కల దుప్పిని ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది కాపాడారు. పాపాం తాగునీటికోసం అటవీ ప్రాంతం నుండి బయటకు వచ్చింది. అది గమనించిన కుక్కలు ఒక్క సారిగా దాడి చేయడంతో ప్రాణాలు కాపాడు కునేందుకు ఆసుపత్రి వైపు వెళ్ళింది. సిబ్బంది కుక్కలను తరిమేసి దుప్పిని కాపాడారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అడవిలో వదిలేశారు.

# మన బడి పిలుస్తోందికార్యక్రమం



ఉదయగిరి, మే 7, ప్రభాతవార్త మండల కేంద్రమైన ఉదయగిరి సినిమా హాల్ సెంటర్ నందు మెయిన్ పాఠశాల నందు గురువారం విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి మెయిన్ పాఠశాల పరిధిలోని సినిహా హాల్ సెంటర్ నందు ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారులు టి.వెంకటేశ్వర్లు, టి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో మనబడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఇద్దరు విద్యార్థులను వారి గృహాలకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి ఇద్దరూ విద్యార్థులను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి మెయిన్ పాఠశాలలో చర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి ఉర్దూ గర్ల్స్ ప్రధానోపాధ్యాయులు షేక్ కరీం, ఉదయగిరి మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌కే రజియాబి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**సైదాపురం, మే 7, ప్రభాతవార్త :** రాపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సైదాపురం మండలంలో ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని రాపూరు సీడీపీవో సునంద తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైదాపురం మండలంలో ఒక మినీ అంగన్‌వాడీ కార్యకర్త 14 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అందులో చాగణం రాజుపాలెం ఎగువ ఎస్టీ సంఘంలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఖాళీగా ఉందని, అదే విధంగా తోచం, కేజీఆర్‌పాలెం, ఆర్‌వైజీ పాలెం, కలిచేడు, తురిమెర్ల, సైదాపురం, గోకుల బృందావనం, లింగసముద్రం, అనంతమడుగు, ఊటుకూరు, చాగణం–1, చాగణం ఎస్సీ కాలనీ, తలుపూరు ఎస్సీకాలనీ–1, తలుపూరు –2 గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు కాళీ అయ్యాయని ఆమె తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి ఈ నెల 25వ తేదీ లోపల అర్హత కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె అన్నారు.

## అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

**వింజమూరు, మే 7, ప్రభాతవార్త :** వింజమూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వివిధ మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో పద్మజాకుమారి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు పోస్టులు, 4 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు పోస్టులు, 29 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.



దరఖాస్తు చేసుకునేందుకు 10వ తరగతి పాస్ అయి ఉండాలి. 2026 జులై నాటికి 21 సంవత్సరాలు నుండి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలి, స్థానిక వివాహిత మహిళ అయి ఉండాలి, పోస్టుల ఎంపికప్రక్రియ ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు నిర్వహించబడుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ యాబిటేషన్ పోస్టులకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మాత్రమే అర్హులు. వీరు 10వ తరగతి పాస్ అయిన వారు ఎవరు లేనియెడల తదుపరి తరగతుల వారు 8 వ తరగతి వరకు అర్హులు.వయస్సు 35 సంవత్సరాల లోపు లేని వారైతే 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులవు తారన్నారు. కార్యకర్తలకు కలిగిరి మండలం రావులకొల్లు ఓసీ, జలదంకి మండలం అన్నవరం ఎస్టీ, అలాగే మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు కొండాపురం ఎస్టీ బగాడుపల్లి బీసీడీ కలిగిరి మండలం పోలంపాడు ఎస్టీ కాలనీ ఎస్టీ కలిగిరి మండలం నాగిరెడ్డిపాలెం ఓసీ అంగన్‌వాడీ సహాయకులు పోస్టులకు కలిగిరి మండలం నాగసముద్రం ఎస్సీ కాలనీ ఎస్సీ టూ క్యాటగిరి వీర్నకొల్లు ఎస్సీ చంద్రారెడ్డిపాలెం ఓసీ చిన్నన్నలూరు ఎస్సీ కాలనీ దండుపాలెం ఓసీ లక్ష్మీపురం ఓసీ అనంతపురం నార్త్ ఓసి కుమ్మరికొండూరు ఎస్సీ–2 కేటగిరి జిర్రావారిపాలెం బసిరెడ్డిపాలెం ఓసీ వింజమూరు మండలం బుక్కాపురం ఓసీ చంద్ర పడి య ఓసి నేరేడుపల్లి ఓసీ నందిగుంట ఎస్సీ 2 కేటగిరి జువ్విగుంటపాలెం ఓసీ వింజమూరు పంచాయతీ పరిధిలో చెర్లతోట ఓసీ జలదంకి మండలం చోడవరం ఎస్సీ టు కేటగిరి గోపన్నపాలెం ఎస్టీ ఎస్సార్ పురం కండ్రిక ఓసి అన్నవరం ఎస్టీ కొండాపురం మండలం ఆదిమూర్తిపురం మెయిన్స్ ఎస్సీ 2 కేటగిరి తూర్పు జంగాలపల్లి బీసీ ఏ ఆదిమూర్తిపురం 2 ఓసీ చింతలదేవి వడ్డీపాలెం బీసీఏ కొత్తపల్లి ఎస్సీ కాలనీ ఎస్2 కేటగిరి కొత్తపల్లి ఓసీ గొట్టిగుండాలపాలెం ఓసి ఇసుక దామెర్ల మెయిన్ ఓసీ కొత్తపాలెం బీసీ డీ గ్రూపులకు కేటాయించినట్లు సీడీపీవో తెలిపారు.కాబట్టి అర్హులైన అభ్యర్థులు ఏడవ తేదీ నుండి 25వ తేదీలోపల దరఖాస్తులుస్థానిక సీడీపీవో లేదా ఐసీడీఎస్ ప్రాజెక్టు వింజమూరు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

## గృహ నిర్మాణ శాఖలో అవినీతిని నిరూపించకపోతే ప్రాణత్యాగం చేస్తా

**– పేదల పక్కా గృహాలలో హౌసింగ్ అధికారులు కాంట్రాక్టర్లతో కలిసి స్టీల్ కుంభకోణానికి పాల్పడ్డారు**

**– బీజేపీ నేత మిడతల రమేష్**

**నెల్లూరు అగ్రికల్చర్, మే 7, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చాలని అందుకు అనుగుణంగా నిధులు కేటాయించి ప్రయత్నాలు సాగిస్తుంటే గృహ నిర్మాణ శాఖ మాత్రం కాంట్రాక్టర్లతో కలిసి కుంభకోణానికి పాల్పడుతోందని బీజేపీ నేత మిడతల రమేష్ ఆరోపించారు. గురువారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి ఈ మేరకు



నెల్లూరులోని హౌసింగ్ జిల్లా కార్యాలయంలో ఈఈ జహీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 కోట్ల మేర హౌసింగ్ ఇంజనీర్లు చేసిన కుంభకోణాన్ని నిరూపించలేకపోతే ప్రాణత్యాగం చేస్తానని ప్రకటించారు. 2022 –2023 సంవత్సరాలలో ప్రతి ఇంటికి బేస్మెంట్లో 342 కేజీలు స్టీల్ వినియోగించాల్సి ఉండగా కేవలం 200 కేజీలు మాత్రమే వినియోగించి అవినీతికి పాల్పడ్డారని వెల్లడించారు. మూడో ఆప్షన్ కింద జిల్లాలో జరిగిన పనులలో 29 వేల గృహాలలో 30 కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని తెలిపారు. లబ్దిదారుల పేర్లతో నిర్మించుకున్న గృహాలలో కూడా మరో 30 కోట్ల మేర స్టీల్ వినియోగంలో దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు. ఇంజనీర్ల అవినీతిని నిరూపించేందుకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గానీ, లా అండ్ ఆర్డర్ పోలీసు గానీ, మెజిస్టీరియల్ విచారణ గాని, ప్రత్యేక సిట్ దర్యాప్తు గాని, ఏసీబీ గాని ఏ దర్యాప్తు సంస్థను ప్రభుత్వం నియమిస్తే ఆ దర్యాప్తు సంస్థకు ఈ కుంభకోణాన్ని సాక్షాలతో సహా నిరూపిస్తామని హామీ ఇచ్చారు. అలా నిరూపించలేని పక్షంలో అక్కడే ప్రాణత్యాగం చేస్తానని రమేష్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సుజన, ఆదినారాయణ, సుబ్బయ్య, నారాయణ యాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ముసునూరు చంద్రబాబునాయుడు కాలనీలో కార్డెన్‌సెర్చ్

**కావలి, మే 7 ప్రభాతవార్త :** కావలి ముసునూరు చంద్రబాబునాయుడు కాలనీలో గురువారం కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించడం జరిగింది. ప్రతి ఇంటిలో సోదాలు నిర్వహించి ద్విచక్రవాహనాలకు సరైన రికా ర్డులు లేని 32 వాహనాలను, రెండు ఆటోలను గుర్తించి స్వాధీనంచేసుకోవడం జరిగింది. ఈసందర్భంగా ఇన్స్‌పెక్టర్ రాజేశ్వరరావు గంజాయి వల్ల కలిగే నష్టాలు హెల్మెట్ ప్రయోజనాలు, సిసి కెమరాలు వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలోభాగంగా జిల్లా ఎస్‌పి అజిత్ వేజెండ్ల ఆదేశాల మేరకు కావలి డిఎస్‌పి వెంకటరమణ పర్యవేక్షణలో ఈ తనిఖీలను చేపట్టడం జరిగిందని తెలిపారు. పట్టణంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న గంజాయి, నాటుసారా బెల్టుషాపులు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంజరుగుతుందన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## సొంతింటి కల నెరవేరనున్న వేళ

**కోట, మే 7 ప్రభాతవార్త :** వచ్చే మూడేళ్లలో పేదల సొంతింటి కల నెరవేర్చాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం. అందులో భాగంగా ప్రధానమంత్రి గ్రామీణ్ అవాజ్ యోజన (పిఎంజివై) కింద నిధుల మంజూరుకు గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే రెండుసార్లు సర్వే చేపట్టారు. ఆ క్రమంలో కోట మండలంలో 1915 ఇళ్లు అర్హులుగా గుర్తించారు. ఈ నెలాఖరులోగా కేంద్రం కొత్త ఇళ్లను మంజూరు చేయనున్న నేపథ్యంలో తొలివిడతగా వీరిలో కొందరికి లబ్ధి చేకూరనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పిఎంజివై 2.0 కింద ఇళ్ల మంజూరుకు జిల్లా గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో సర్వే చేయించారు. ఆ వివరాలను సంబంధిత అధికారులు యాప్‌లో నమోదు చేశారు. పక్కా గృహానికి దరఖాస్తు చేసుకున్న వారి ప్రస్తుత నివాసం, నిర్మాణం చేపట్టనున్న స్థలం ఫొటోలు అప్‌లోడ్ చేశారు. పిఎంజివై కింద గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలం లేదా ప్రభుత్వం ఇచ్చిన పట్టా కలిగిన వారు అర్హులు. తెల్ల రేషన్‌కార్డుతో పాటు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, భార్యభర్తల ఆధార్ నకలు సమర్పించాల్సి ఉంటుంది. గృహ నిర్మాణ పథకం కింద గతంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఈ పథకం వర్తించదు.

## బడిపిలుస్తోంది .... రా కదలిరా

**బుచ్చి మే 7 ప్రభాతవార్త** ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తల్లిదండ్రులు వాటిని సద్వినియోగం చేసుకోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని మండల విద్యాశాఖ అధికారులు ఎం.దిలీప్‌కుమార్,పి.వి రత్నం అన్నారు. బుచ్చి రెడ్డిపాళెం మండలంలోని పంచేడు,సాల్మాన్‌పురం, చెల్లాయపాళెం,వడ్డిపాళెం, తదితర గ్రామాల్లో బడిపిలుసొంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు 5 సంవత్సరాలు నిండిన విద్యార్దులు అందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి తల్లిదండ్రులు యువత స్వచ్చంద సంస్థలు సహకరించాలని కోరారు.అర్హత కలిగిన ఉపాధ్యాయులు,టాయిలేట్స్ తల్లికి వందనం నోబ్యాగ్‌డే వంటి కార్యక్రమాలతో సమగ్ర అభివృద్ధి నిలయాలు ప్రభుత్వం పాఠశాలలని తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యహ్నా బోజనం రాగి జావ, చిక్కిలు, వంటి పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని అన్నారు. ఇంగ్లీషు మీడియం బోధనతో ఉన్నత చదువులకు బాటలు వేసి ప్రోత్స హిస్తామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్,మల్లికార్జున, సిఆర్‌ఎంటిలు మల్లేశ్వర్‌రెడ్డి, మహేష్, మస్తానయ్య, శ్రీనయ్య,సురేఖ, మాల్యాద్రి తల్లిదండ్రులు పాల్గోన్నారు.



## సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు

**ఉదయగిరి, మే 7, ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా వ్యవసాయ యంత్రాలను రైతులకు సబ్సిడీపై అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేశారు. ఈ సందర్బంగా ఈనెల 19వతేదీ లోపల రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు, విత్తడం, నాటడం, తవ్వే యంత్రాలు, పవర్ టిల్లర్లు, నూర్పిడి యంత్రాలు, గడ్డి కట్టి యంత్రాలు రాయితీపై అందిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు, మహిళ రైతులకు యూనిట్ విలువలో 50 శాతం సబ్సిడీ అందజేస్తున్నారని తెలిపారు. తగిన వివరాలకు గ్రామ వ్యవసాయ సహాయకులను కలవాలని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ ఇన్‌ఛార్జి ఏడీఏపీ చెన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## విద్యార్థులకు బహుమతులు వితరణ

**గూడూరు, మే 7, ప్రభాతవార్త :** మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన మార్పులతో ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించారని భవిష్యత్తులో విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సూచించారు. గూడూరు పట్టణంలోని డిఆర్ డబ్ల్యూ కళాశాలలో ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో గూడూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో 550కు పైగా మార్కుల సాధించిన విద్యార్థిని విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ హాజరయ్యారు. విద్యార్థినీ విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులను సన్మానించి ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో ఈ సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని మంత్రి నారా లోకేష్ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చేదిద్దడం వల్ల ఇది సాధ్యమైందని గుర్తు చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మంచి రుచికరంగా మధ్యాహ్నం భోజనం ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులు ఇంకా బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు గురువులకు గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ సనత్ కుమార్, ఎంఈఒ రవీంద్ర, రవుఫ్, నాయకులు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, కిరణ్ కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, బిల్లు చెంచురామయ్య, రహీం, మస్తాన్ నాయుడు, రాజశేఖర్, భాస్కర్ రెడ్డి, జలీల్, శివకుమార్, కిషోర్ నాయుడు, భారతి, తదితరులు పాల్గొన్నారు.



## తిరుమలకు బస్సు సర్వీసులు పెంచాలి

**– రాత్రి వేళల్లో డిపోకి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి**

**– ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సీపీఐ నాయకుల వినతి**

**గూడూరు, మే 7, ప్రభాతవార్త :** గూడూరు నుండి తిరుపతి తిరుమల పుణ్య క్షేత్రానికి బస్సు సర్వీసులను పెంచాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ కరోనాకు ముందు తిరుపతి, తిరుమలకు 15 బస్సు సర్వీసులు గూడూరు డిపో నుండి రాకపోకలు సాగిస్తుండగా ప్రస్తుతం కేవలం రెండు బస్సులకే పరిమితమయ్యాయని తెలిపారు. వేసవి సెలవుల్లో బస్సు సర్వీసులను వెంటనే పెంచాలని కోరారు. అదేవిధంగా రాత్రి వేళల్లో బస్సులన్నీ గూడూరు బైపాస్ నుండి తిరుపతి, బెంగుళూరు, చెన్నై వైపు వెళుతున్నాయని, ఒక్క బస్సు కూడా గూడూరు పట్టణంలోకి రావడం లేదని, దీంతో ప్రయాణికులు రాత్రి వేళల్లో బైపాస్ లో దిగి గూడూరుకు రావాల్సి వస్తోందని, అదేవిధంగా రాత్రి 9 దాటితే నెల్లూరుకు వెళ్లాలన్నా బైపాస్‌కు వెళ్ళాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రాత్రివేళల్లో బస్సులు గూడూరు బస్టాండు మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన డీఎం లక్ష్మి మాట్లాడుతూ డిపోకు కొత్తగా రెండు బస్సులు మంజూరయ్యాయని, ఆ బస్సులను తిరుపతి మార్గంలో తిప్పుతామన్నారు. త్వరలోనే గూడూరు తిరుపతికి పెయిడ్ బస్ సర్వీసులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్, సహాయ కార్యదర్శి షేక్ జమాలుల్లా, పట్టణ కన్వీనర్ సునీల్ యాదాల, చిల్లకూరు మండల కార్యదర్శి గుండాల రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కొమ్మి నారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మీరా, ఏఐఎస్ఎఫ్ నాయకులు రిజ్వాన్, దీవెన్ తదితరులు పాల్గొన్నారు.



## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

**నెల్లూరు క్రైమ్, మే 7, ప్రభాతవార్త:** స్థానిక ఉమ్మారెడ్డి గుంట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. మృతునికి సుమారు 45 ఏళ్ళ వయసు ఉంటుందని, ఎరుపు రంగు చొక్కా, బ్లాక్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, మృతుడిని గుర్తించడానికి మృతుని వద్ద ఎటువంటి ఆనవాళ్లు లభించలేదని పోలీసులు తెలిపారు. నెల్లూరు రైల్వే స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్సై హరిచందన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మా తండ్రి కాకాణి రమణారెడ్డి ఆశయాలే మాకు మార్గదర్శకం

**– మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి**

**పొదలకూరు, మే 7, ప్రభాతవార్త:** మా తండ్రి కాకాణి రమణారెడ్డి ఆశయాలే మాకు మార్గ దర్శకమని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పొదలకూరు మండలం, తోడేరు గ్రామంలో కాకాణి రమణా రెడ్డి 5వ వర్ధంతిని పురస్కరించుకుని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి, వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి కాకాణి రమణా రెడ్డి సమాధి వద్ద పుష్పగుచ్చాలు ఉంచి, నివాళులర్పించారు. కాకాణి రమణా రెడ్డిపై ఉన్న మమకారంతో స్థానిక ప్రజలు, ఆత్మీయులు, అభిమానులు, వైఎస్ ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ అధికారం ఉన్నా, లేకపోయినా ప్రజలతో మమేకమై, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండడమే మా తండ్రి దగ్గర మేము నేర్చుకున్న ప్రధానమైన అంశమన్నారు. కష్ట కాలాన్ని అధిగమించడానికి అవసరమైన ఓర్పు, నేర్పుతో పాటు, కష్టకాలం ఎదురైనప్పుడు దాన్ని ఎదుర్కొని తట్టుకొని ముందుకు సాగే గుండె ధైర్యం, మా తండ్రి మాకు ఇచ్చిన వారసత్వం అని అన్నారు. మా కుటుంబం ఎదుగుదలకు మా తండ్రి పునాది వేశాడు, మేము మా తండ్రి వారసత్వాన్ని కొనసాగించామన్నారు. మాకు చెప్పుకునేందుకు, ప్రజల్లోకి వెళ్లేందుకు, ప్రజలు మమ్మల్ని గుర్తించేందుకు, మా తండ్రి వారసత్వం మాకు దోహదపడిందని తెలిపారు. మా తండ్రి మాత్రం పూర్తిగా తన జవసత్వాలతో ఎటువంటి వారసత్వం లేకపోయినా రాజకీయంగా ఎదిగి ఏకధాటిగా 18 సంవత్సరాల కాలం పాటు పొదలకూరు సమితి అధ్యక్షులుగా తిరుగులేని నాయకత్వాన్ని ప్రదర్శించాడని చెప్పారు. మా కుటుంబం అన్ని విధాల ఎదుగుదలకు మా తండ్రి కృషి ,పట్టుదల, ఔదార్యం, త్యాగం మమ్ములను, మా కుటుంబ సభ్యులందరినీ ఉన్నత స్థాయికి చేర్చగలిగాయన్నారు. మా తండ్రి భౌతికంగా మా మధ్య లేకపోయినా, ఆయన చూపిన బాటలో, ప్రజా సేవలో ముందుకెళ్లడమే మేము ఆయనకు ఇచ్చే నిజమైన నివాళిగా భావిస్తామన్నారు. మా తండ్రి గారి వర్ధంతి సందర్భంగా తరలివచ్చిన ప్రజలకు, ఆత్మీయులకు, అభిమానులకు, నాయకులు, కార్యకర్తలకు మనస్పూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు.



## ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలి

**కోవూరు, మే7 ప్రభాతవార్త :** జనగణన కోసం ప్రతి ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఎన్యుమరేటర్లకు జనగణన కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు 33 ప్రశ్నలతో కూడిన సమాచారాన్ని ఇస్తే సరిపోతుందని, ఆధార్ నెంబర్ కానీ, ఓటీపీ కానీ వారికి చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఈ నెల 30వ తేది వరకు ఈ జనగణన కార్యక్రమం కొనసాగుతుందని, మండలంలోని ప్రజలు తమవంతుగా సమాచారం ఇచ్చి ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బషీర్, ఏఎస్‌వో రామ్మోహన్,డిప్యూటీ ఎంపీడీవో, సురేష్, తదితరులు ఉన్నారు.



## అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

**కోవూరు, మే7 ప్రభాతవార్త :** కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చి మండలానికి సంబంధించి ఖాళీగా ఉన్న 14 అంగన్‌వాడీ ఆయా పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శారద అన్నారు. కోవూరులోని కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ ఈ అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా పదవ తరగతి పాస్ కావడమే కాకుండా 1-7-2026 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల లోపు అర్హులన్నారు. స్థానికంగా ఉండడమే కాకుండా వివాహిత లేక వితంతువులు అయి ఉండాలన్నారు. అవివాహితలు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులు అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులకు ఏ కులము నిర్ణయించబడినదో సదరు కులము వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓపెన్ కేటగిరికి కేటాయించిన పోస్టులకు ఏ కులం వారైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కోవూరు మండలంలోని ఎన్ఎస్ఆర్ కాలనీ(ఎస్టీ), తూర్పు అరుంధతివాడ(ఎస్సీ), వేగూరు మండలం సీతారామపురం (ఓసీ జనరల్, (బీసీ–డీ), గుమ్మలదిబ్బ–3 ఓసీ జనరల్, పాటూరు చక్కిరాల దిబ్బ (ఎస్టీ), బుచ్చిరెడ్డిపాలెం మండలం పెనుబల్లి(ఎస్టీ), ఇస్కపాలెం పంచాయతీ గోపాలపురం జనరల్ (బీసీ–డీ), కొడవలూరు మండలం గౌతమ్ నగర్ పంచాయతీ అశోక్‌నగర్ జనరల్(బీసీ–బీ), కొత్తవంగల్లు పంచాయతీ చీకిరేణిగుంట (ఎస్టీ), చౌటపాలెం(ఎస్సీ, బసవయ్యపాలెం జనరల్ బీసీ–డీ) యల్లాయపాలెం –3 జనరల్ బీసీ–డీ, తలమంచి జనరల్ (ఈడబ్ల్యూఎస్), విడవలూరు మండలం ఊటుకూరు వెంకటరెడ్డిపాలెం జనరల్ బీసీ–ఏ, ఈ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు కోవూరు మండలంలో గల సమగ్ర శిశు అభివృద్ధి కార్యాలయానికి ఈ నెల 25వ తేది లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.



## 9న జలదంకిలో అమర్‌రాజ వారి ప్లేస్‌మెంట్ డ్రైవ్: ఎంఇఒ

**జలదంకి,మే7,ప్రభాతవార్తః**జలదంకి హై స్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్దినులకు అమర్ రాజ బ్యాటరీస్ కంపెనివారు శనివారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాదికారి పద్మనాభరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశాడు.ఆకంపెని స్కిల్ డవలప్‌మెంట్ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫర్‌కోసం ఈ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.ఉదయం 9గంటలకు కళాశాల ఆవరణలో జరుగు ఈడ్రైవ్‌లో మండలంలోని ఇంటర్మీడియట్ పాస్ ఆర్ ఫెయిల్ విద్యార్దిని, విద్యార్దులు ,అలాగే పదవతరగతి పూర్తయిన వారు పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ కోరాడు.

## అంగన్‌వాడి పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకోండి

**జలదంకి,మే7,ప్రభాతవార్తః** జలదంకి మండలంలో అంగన్‌వాడి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని వింజమూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ పద్మజా కుమారితెలియజేసింది.మండలంలో అన్నవరం గ్రామ ఎస్‌టి కార్యకర్త,నాగిరెడ్డిపాళెం మిని అంగన్‌వాడి కార్యకర్త,అలాగె గోపన్నపాళెం ఎసిటి,చోడవరం ఎస్‌సి కేంద్రల సహాయకుల పోస్టులు ఖాళీలు వున్నాయని తెలిపారు.కావున ఆయా గ్రామాల అర్హులైన అభ్యర్దులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అభ్యర్తులు పూర్తిచేసిన ధరఖాస్తులు గురువారం నుంచి ఈనెల 25 సాయంత్రం లోపల సిడిపిఒ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వింజమూరు అడ్రస్‌కు చేరేవిదంగ చూసుకోవాల వివరించింది.

## గ్రంథాలయంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలు

**కొడవలూరు, మే 7, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం లైబ్రేరియన్ కె. రాజేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులతో పుస్తక పఠనం నిర్వహించారు. అనంతరం విశ్వ కవి, జాతీయ గీతం సృష్టికర్త, నోబెల్ అవార్డు గ్రహీత శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ జయ ంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విద్యార్థులకు రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత విశేషాలను వివరించారు. 1861 మే 7న వంగదేశంలో దేవేంద్రనాథ్ ఠాగూర్, శారదాదేవి దంపతులకు పద్నాలుగవ సంతానంగా జన్మించిన ఠాగూర్ చిన్ననాటి నుంచే ప్రకృతి ప్రేమికుడిగా, సాహిత్యాసక్తి కలిగిన వ్యక్తిగా ఎదిగారని తెలిపారు. ఆముదం దీపం వెలుగులో పుస్తకాలు చదువుతూ, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ గడిపిన ఆయన బాల్యం విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని లైబ్రేరియన్ రాజేశ్వరి పేర్కొన్నారు.



## అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**విడవలూరు, మే 7, ప్రభాతవార్త :** మండలంలోని వెంకటరెడ్డి పాలెం, పార్లపల్లి పంచాయతీ పరిధిలోని చవటపాలెం అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపర్వైజర్ సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై, వివాహితులై ఉండాలని పేర్కొన్నారు. ఈ ఏడాది జూలై 1 నాటికి 25 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. వితంతువులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.చవటపాలెం కేంద్రం ఎస్సీ కేటగిరీకి, వెంకటరెడ్డి పాలెం కేంద్రం బీసీ కేటగిరీకి సంబంధించిన పోస్టులని వివరించారు.పదో తరగతి అర్హత కలిగిన వారు దరఖాస్తు చేయనట్లయితే, అనంతరం 9వ తరగతి అర్హత కలిగిన వారికి అవకాశం కల్పించబడుతుందని తెలిపారు.అభ్యర్థులు కోవూరు ఐసిడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు వివరాలు పొందుపరచి సమర్పించాలని సూపర్వైజర్ సురేఖ కోరారు.

## అంగన్వాడీ పోస్టుల నోటిఫికేషన్ విడుదల

**విడవలూరు, మే 7 ప్రభాతవార్త:** మండల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ను అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డికి అంగన్వాడీ సూపర్వైజర్లు గురువారం వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయాల నోటీస్ బోర్డుల్లో నోటిఫికషన్ను అంటించారు. అర్హులైన మహిళలు దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచిం చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు నాగభూషణమ్మ, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.



## జనసేన కార్యకర్త కుటుంబానికి రూ.60 వేల సాయం

**కొడవలూరు, మే 7 ప్రభాతవార్త:** జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో బాధిత జనసేన కార్యకర్త కుటుంబానికి రూ.60 వేల ఆర్థిక సాయాన్ని కోవూరు నియోజకవర్గ జనసేన నాయకులు అందించారు. మండలంలోని చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన బొద్దు అనీల్ కుమార్ (30) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. రోజువారీ కూలీ పనులతో కుటుంబాన్ని పోషిస్తున్న ఆయనకు భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. అనీల్ మృతితో కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు ఏపీ టిడ్కో ఛైర్మన్ అజయ్ కుమార్‌కు సమాచారం అందించగా, జిల్లా సమిష్టి నాయకత్వం సహకారంతో కోవూరు నియోజకవర్గ నాయకుడు గాదిరాజు జీవన్ కృష్ణ, జిల్లా ఐటీ విభాగం కోఆర్డినేటర్ నక్కల శివకృష్ణ, కొడవలూరు మండల అధ్యక్షుడు చక్కా శూలం బాబు ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.60 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యకర్తలకు కష్టకాలంలో అండగా నిలవడం పార్టీ బాధ్యత అని, బాధిత కుటుంబంలోని చిన్నారుల చదువుకు భవిష్యత్తులో కూడా జనసేన పార్టీ సహకారం అందిస్తుందని నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్ సురేంద్ర, స్థానిక నాయకులు హజరత్ రెడ్డి, బ్రహ్మయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## మన్యం వీరునికి ఘన నివాళులు



**కోవూరు, మే 7 ప్రభాతవార్త :** కోవూరులోని మండల పరిషత్ కార్యా లయంలో గురువారం మ న్యం వీరుడు అల్లూరి సీతారా మరా జు వర్ధం తి వేడుకలను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డీవో శ్రీహరిరెడ్డి ఆ మహనీయుని చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడు చేసిన త్యాగాలను గుర్తు చేసు కున్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు ఉషారాణి, డిప్యూటీ ఎంపీడీవో సురేష్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

**కోవూరు, మే7 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు వాటిని సద్వినియోగం చేసుకుని తమ బిడ్డల ను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎం ఈవో–2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ చంద్రమౌళి నగర్ గిరిజన కాలనీలో గురు వారం బడి పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలు ఉచితంగానే అందుతున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాలలో చేర్పించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఎంటీ విష్ణు, ఉపాధ్యాయులు ఉన్నారు.



## విధినిర్వహణలో సిఆర్‌పిఎఫ్‌జవాన్ ఎన్.శేఖర్‌రెడ్డి మృతి

**మర్రిపాడు,మే7,ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం సింగనపల్లి గ్రామానికి చెందిన సిఆర్‌పిఎస్‌జవాన్ విధి నిర్వహణలో ఉండగా గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మహారాష్ట్ర క్యాంప్ కార్యాలయంలో మృతిచెందాడు. సైనిక లాంఛనాలు పూర్తి చేసుకొని శుక్రవారం తెల్లవారుజాముకి తమ స్వగ్రామమైన సింగనపల్లికి ఆయన పార్థివ దేహం తీసుకువస్తారని బంధువులకు సంబంధిత అధికారులు తెలిపారు.



## మహానాడును పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలి



**కోవూరు, మే7 ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలోని కోవూరు నియోజకవర్గంలో తొలిసారిగా జరుగుతున్న 2026 మహానాడు కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా ప్రతి టీడీపీ కార్యకర్త దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఏపీ ఈఎంసీఎల్ ఛైర్మన్ దినేష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం వీపీఆర్ కార్యాలయంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో మహానాడుకు సంబంధించి సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. ఇప్పటికే జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ అధ్యక్షులు సమిష్టిగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఇటువంటి మంచి అవకాశాన్ని కోవూరుకు అందించిన పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు బీద రవిచంద్ర, పార్టీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తదితరులు ఉన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



**కావలి, మే 7 ప్రభాతవార్త :**కావలి పట్టణంలోని గాయత్రి నగర్‌లో దేవరకొండ శ్రీనివాసులు వాటర్‌ప్లాంట్ వద్ద టిడిపి పట్టణ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాసులు ఆ ధ్వర్యంలో ఏర్పాటు చేసిన కావ్యన్న చలి వేంద్రంను గురువారం కావలి ఎమ్మెల్యేదగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ముఖ్య అతిధిగా పా ల్గొని ప్రారంభించి మజ్జిగను, మంచినీరు పం పిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు దేవరకొండ శ్రీనివాసులు మిత్ర బృందం ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా లారీ అసోసియేషన్ సభ్యు లు వారి మిత్రులు పుల్లపునాయుడు పేరుమీద యాచకులకు భోజనం, దస్తులు పాదరక్షలు, పంపిణీ చేయ డం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలకు సేవచేసే ఉద్దేశంతో చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాల్లో యువత ముందుండడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో సేవ చేయడం గొప్ప విషయమని సమాజానికి ఉపయోపగపడే కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, లారీ అసోసియేషన్ సభ్యులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## రక్త బలహీనతలు, బ్లడ్ క్యాన్సర్‌పై అవగాహన అవసరం

**- మెడికవర్ హాస్పిటల్ మెడికల్ అండ్ హెమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ మౌనికరెడ్డి యల్లాల**



**నెల్లూరు, మే 7, ప్రభాతవార్త-వైద్యం** ప్రస్తుతం జీవన శైలి మార్పులు, పోషకాహార లోపం, పర్యావరణ ప్రభావాల కారణంగా రక్త సంబంధిత వ్యాధులు, బ్లడ్ క్యాన్సర్స్ కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపధ్యంలో ప్రజల్లో అవగాహన చాలా అవసరం అని మెడికల్ అండ్ హెమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ మౌనికరెడ్డి యల్లాల తెలిపారు. రక్త బలహీనత(అనీమియా) అనేది సాధారణంగా కనిపించే సమస్య. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఎక్కువగా దీనికి గురవుతున్నారు. శరీరంలో హీమోగ్లోబిన్ తగ్గిపోవడం వల్ల అలసట, బలహీనత, తల తిరగటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఇంటి లక్షణాలు కనిపిస్తాయి. సరైన ఆహారం తీసుకోకపోవడం, ఐరన్ లోపం, జన్యుపరమైన కారణాలు దీనికి ప్రధాన కారణాలు దీనికి ప్రధాన కారణాలు. అదే విధంగా బ్లడ్ క్యాన్సర్స్ లుకేమియా, లింఫోమా, మల్టిపుల్ మైలోమా వంటి వ్యాధులు రక్త కణాల్లో మార్పులు వచ్చి అసాధారణంగా పెరగటం వల్ల కలుగుతాయి. ప్రారంభ దశలో వీటి లక్షణాలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల చాలా మంది నిర్లక్ష్యం చేస్తారు. తరచూ జ్వరం, బరువు తగ్గడం, ఎముకల నొప్పి, ఇన్ఫెక్షన్లు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. సమయానికి పరీక్షలు చేయించుకుంటే ఈ వ్యాధులను తొందరగా గుర్తించవచ్చు. రక్త పరీక్షలు, బోన్ మారో పరీక్షలు ద్వారా నిర్ధారణ చేసి, కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ, అవసరమైతే బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ ద్వారా చికిత్స అందించవచ్చు. నెల్లూరు ప్రజలు చిన్న లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించడం ద్వారా పెద్ద సమస్యలను నివారించవచ్చు. సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన జీవన శైలి పాటించడం చాలా ముఖ్యం అని డాక్టర్ మౌనికరెడ్డి సూచించారు. స్థానికంగానే ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉండటం వల్ల రోగులు ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గిందని ఆమె తెలిపారు.

## గూడూరు నారాయణలో ఫెమ్ ఫ్లేర్-2026



**గూడూరు, మే 7, ప్రభాతవార్త** గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా సాధికారత, మహిళల ప్రతిభాభివృద్ధి, సమాజంలో మహిళల పాత్రను చాటి చెప్పే ఉద్దేశ్యంతో ఫెమ్ ఫ్లేర్-2026 కార్యక్రమాన్ని గురువారం కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల మహిళా వేదిక ఆధ్వర్యం వహించగా విద్యార్థినులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థినుల కోసం పలు సృజనాత్మక సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. అందులో ఎలెక్యూషన్, ఆర్ట్ పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీ, స్పాట్ ఈవెంట్స్ ఎగ్జిబిషన్, సింగింగ్ పోటీ, డాన్సింగ్ పోటీ, స్కిట్ డ్రామా పోటీ, ఫ్లాష్ మొబ్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కళాశాల ఆవరణ మొత్తం సాంస్కృతిక ఉత్సాహంతో కళకళలాడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ శైలజ, ఏకాంబరం, ఎం.బి. బి. యస్. (జనరల్ సర్జన్ నెల్లూరు) మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం, విద్య, ఆత్మవిశ్వాసం గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగాలంటే విద్యతో పాటు ధైర్యం, పట్టుదల కూడా ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు విజ్ఞాన శాస్త్రం, వైద్యం, సాంకేతిక రంగాలలో విశేష విజయాలు సాధిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విశ్వక్సేనారెడ్డి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కళాశాల ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థినులు తమ ప్రతిభను వెలికితీసుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. మహిళా వేదిక కన్వీనర్ వి. స్వర్ణ కార్యక్రమ నిర్వహణ వివరాలను తెలియజేస్తూ మహిళల ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో ఫెమ్ ఫ్లేర్-2026" ను నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో విజేతలైన విద్యార్థినులకు బహుమతులుఅందజేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఏటకొండారెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలే అజెండాగా మండల సర్వసభ్య సమావేశం




**వింజమూరు, మే 7, ప్రభాతవార్త** మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే ఆశించిన ఫలితాలు అందుతాయని ఎంపీపీ వనిపెంట హైమావతి స్పష్టం చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగినమండల సర్వసభ్యసమావేశం ప్రజల గొం తుకగా నిలిచింది. పారిశుధ్యం నుంచి పెన్షన్ల వరకు, తాగు , సాగునీటి నుంచి విద్యుత్ సమస్యల వరకు ప్రతి అంశంపై ఈ సమావేశంలో చర్చ సాగింది. సమా వేశం ప్రారంభం కాగానే వివిధ శాఖల అధికారులు వారి వారి శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు పురోగతి వివరించారు. అయితే క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎంపీపీ అధి. కారుల వద్ద ప్రస్తావించారు. ముఖ్యంగా వేసవి కాలం దృష్ట్యా గ్రామాలలో తాగునీటి ఎద్దడి రాకుండా చూ డాలని పాడైన రహదారులకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. అర్హులైన ఏ ఒక్క లబ్దిదారుడుకు సాంకేతిక కారణాలతో పథకాలకు దూరం కాకూడదని పింఛన్ల పంపిణీలో పారదర్శకత ఉండాలని పేర్కొ న్నారు. అలాగే వేసవికాలంలో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులు దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధిలో అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేద్దామని పేర్కొన్నారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన ప్రతి సమస్యను సంబంధిత శాఖల ద్వారా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ పనులు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఆనంగి రమణయ్య, మండల ఎంపీటీసీలు బసిరెడ్డి సుమలత, కాటం ప్రసన్న, గవ్వల మల్లికార్జున, పల్ల పురుషోత్తం, సా ధం మౌనిక, కో ఆప్షన్ సభ్యులు రఫీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సాయినామస్మరణతో విశేష పూజలు



**విడవలూరు, మే 7, ప్రభాతవార్త :**దత్త సాయి బాబా ఆలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి పాలాభి.షేకం, అర్చన, పూలంగి సేవ, హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించగా, భక్త భజన మండలి సభ్యులు"సాయిరాం" నామస్మరణతో భక్తి గీతాలు ఆలపిస్తూ భక్తులను ఆధ్యా త్మిక భావనలో ముంచెత్తారు. "భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని దువ్వూరు వెంకట శేషారెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు దువ్వూరు సందీప్ రెడ్డి నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించి సేవాభావాన్ని చాటుకున్నారు.

## రాష్ట్రంలోనే ఉత్తమ జిల్లా శాఖగా నిలిచిన నెల్లూరు రెడ్‌క్రాస్ శాఖ

**- గవర్నర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ చైర్మన్ విజయ్ కుమార్ రెడ్డికి ఘన సత్కారం, ఉత్తమ జిల్లా శాఖ అవార్డు బహుకరణ**



**నెల్లూరు, మే 7, ప్రభాతవార్త-వైద్యం** ఇండి యన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో గురువారం విజయ వా డలోని రాజ్ భవన్‌లో నిర్వహించిన కార్యక్ర మంలో రాష్ట్రంలోనే అత్యుత్తమ జిల్లా శా ఖగా నిలిచిన రెడ్ క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ కు గవర్నర్ అబ్దుల్ అజీజ్ చేతుల మీదుగా ఘన సత్కారం లభించింది. జిల్లా శాఖ చైర్మ న్ శ్రీ వాకాటి విజయ కుమార్‌రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుంటూ ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడుతుందని కొనియాడారు. సేవాభావంతో పని చేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు, రక్తదాతలు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. యువత ఎక్కువ సంఖ్యలో స్వచ్ఛంద రక్తదా నానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ చైర్మన్ వైడి రామారావు మా ట్లాడుతూ నెల్లూరు జిల్లా శాఖ, కావలి ఉప శాఖ సభ్యత్వనమోదు, వనరుల సమీకరణ, వివిధసేవా ప్రాజెక్టుల సమర్ధ నిర్వహణ, విపత్తుల సమయంలో ప్రజలకు అందిస్తున్న సేవలతో నెల్లూరు జిల్లా శాఖ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. అలాగే నెల్లూరులో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న క్యాన్సర్ హాస్పిటల్ సేవలను ప్రత్యేకంగా అభినందించారు. తలసీమియా బాధిత చిన్నారుల కోసం రక్త నిల్వలను సమృద్ధిగా సేకరించి, గత 25 సంవత్సరాలుగా పేదలకు ఉచితంగా సేవలు అందిం చడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సేవలు మానవత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా శాఖ చైర్మన్ వాకాటి విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు మొత్తం రెడ్ క్రాస్ సభ్యులు, రక్తదాతలు, సేవాభావంతో సహకరిస్తున్న దాతలకు చెందుతుందని తెలిపారు. సమాజంలో అవసరమైన ప్రతి వ్యక్తికి సహాయం అందించే దిశగా రెడ్ క్రాస్ నిరంతరం పని చేస్తుందని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో నెల్లూరు జిల్లా శాఖకు లభించిన ఈ గౌరవం జిల్లా ప్రజలకు గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు. మరింత బాధ్యతతో నెల్లూరు జిల్లా రెడ్ క్రాస్ సేవలను విస్తరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ జనరల్ సెక్రటరీ అండ్ సీఈఓ ఏకే ఫరీదా, మేనేజింగ్ కమిటీ సభ్యులు డి.రవి ప్రకాష్, పలువురు ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు త్యాగం స్ఫూర్తిదాయకం



**కోవూరు, మే7 ప్రభాతవార్త :** స్వాతంత్ర్య సమరంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి గిరిజన హక్కుల కోసం తమ జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తి ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదా యకమని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. ఈమేరకు గురువారం వీపీఆర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ మహనీయుని త్యాగం,అజేయమైన ధైర్యం,దేశభక్తి ప్రతిఒక్కరికి స్ఫూర్తిదాయ కమన్నారు.

## జడ్పీలో ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, మే 7, ప్రభాతవార్త** స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు త్యాగస్ఫూర్తి, దేశభక్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం అని జిల్లా పరిషత్, సీఈవో శ్రీధర్ రెడ్డి తెలియజేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ,జడ్పీ సీఈవో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని కొనియాడారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజన ప్రజలను ఏకం చేసి, స్వాతంత్రం కోసం ధైర్యసాహసాలతో పోరాడి తన ప్రాణాలను అర్పించిన మహావీరుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మోహన్ రావు జడ్పీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**బుచ్చి మే 7 ప్రభాతవార్త** ఈనెలలో కొడవలూరు మండలం కిసాన్ సెజ్‌లో జరుగునన్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జొన్నవాడ టిడిపినాయకులు కాంక్షించారు. ఉమయ్య స్వామి కళ్యాణ మండపంలో జరిగిన ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రూరల్ బ్యాంకు చైర్మన్ ఏటూరు శివరామ కృష్ణారెడ్డి, రూరల్ అధ్యక్షులు జగదీష్ నీటి సంఘం అధ్యక్షులు బత్తల హరికృష్ణా,నీటి సంఘం అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, జొన్నవాడ నా యకులు ఉమయ్యస్వామి, పెంచలయ్య, పురిణి హరినాద్‌రెడ్డి, పంచేడు నాయకులు అమర్‌నాద్‌రెడ్డి తది తరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నేతృత్వంలో మన నియోజకవర్గంలో జరిగే ఈకార్యక్రమాన్ని మనందరం విజయవంతం చేయాలని అన్నారు. మన జిల్లాలో మొట్టమొదటగా ఏర్పడం చేయడం మన అదృష్టమంగా భావించి అంద రం సమిష్టగా కృషి చేద్దామని అన్నారు. ప్రతి నాయకుడు,కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకొని మహానాడు విజయవంతం చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో నాగమాంబపురం నాయకులు వల్లూరు రాఘవరెడ్డి, మినగల్లు నాయకులు సురేష్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ ముంగర సుధాకర్, మస్తానయ్య, మౌళి, పలువురు టిడిపినాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

## తప్పిపోయిన చిన్నారిని గంటల్లోనే గుర్తించిన సంతపేట పోలీసులు




**నెల్లూరు క్రైమ్, మే 7, ప్రభాతవార్త:** విడవలూరు మండలం దండిగుంట గ్రామానికి చెందిన మద్దులూరు సుమన్ దంపతులు తమ నాలుగేళ్ల చిన్నారి భవ్యశ్రీతో కలిసి గురువారం నగరంలోని చిన్న బజార్లో ఆభరణాలు కొనుగోలు చేసేందుకువచ్చారు. దుకాణంలో కొనుగోలు చేస్తున్న సమయంలో భవ్యశ్రీ ఆడుకుంటూ కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. చిన్నారి కోసం పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు అప్రమత్తమై ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. నగర ఏఎస్పీ దీక్షా ఆధ్వర్యంలో సంతపేట సీఐ వై వి సోమయ్య, ఎస్సై అనిల్ రెడ్డి, పోలీసు సిబ్బంది కలిసి పట్టణంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తూ విస్తృతంగా వెతికారు. సుమారు 45 సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన అనంతరం మధ్యాహ్నం 2.10 గంటల సమయంలో చిన్నారిని సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. చిన్నారిని క్షేమంగా గుర్తించి అప్పగించిన పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## కావలి ఎమ్మెల్యే చేతులమీదుగా రూ.4,03,268 ఎల్ఓసి అందజేత



**కావలి, మే 7 ప్రభాతవార్త :** కావలి ఎమ్మె ల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా దగదర్తి మండలం, ఉలవపాళ్ళ గ్రామానికి చెందిన కోనపరెడ్డి వినయ్ కు మార్‌కు గురువారం కావలి ఎమ్మెల్యే కార్యాలయం నందు రూ .4,03,268ల ఎల్ఓసి ద్వారా ఆర్థికసాయం అందజేయ డం జరిగింది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో వినయ్‌కుమార్ తలకు తీవ్ర గాయలు కావడంతో ఆయన మెడికవర్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. డాకటర్ల సూచనల మేరకు అత్యవసర శస్త్రచికిత్స అవసరం అవడంతో చికిత్సల ఖర్చుల నిమిత్తం ఈ సాయాన్ని ఎల్ఓసి ద్వారా మంజూరు చేసి అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధితుడు త్వరగా కోలుకోవాలని కోరారు.

## ఉపాధి హామీ పనులు ఆకస్మిక తనిఖీ



**సైదాపురం, మే 7, ప్రభాతవార్త** మండల కేంద్రమైన సైదాపురం పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఉపాధిహామీ పథకం ద్వారా జరుగుతున్న ఊటగుంట పనులను డ్వామా ప్రాజెక్టు డైరక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాజరు పట్టికలను, సెవన్ మస్టర్లను పరిశీలించారు. ఎండ తీవ్రతకు వేతన దారులకు ఏర్పాటు చేసిన షెడ్డులను ఆయన పరిశీలించారు. కాసేపు వేతనదారులతో మాట్లాడి వారి కోసం ఏర్పాటు చేసిన వసతులు, వేతనాలపై చర్చించారు. అనంతరం వేతన దారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన వెంట ఏపీవో సురేంద్ర, తదితరులు ఉన్నారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు ఘనంగా సన్మానం



**సైదాపురం, మే 7, ప్రభాతవార్త** సైదాపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ బాల సుబ్రహ్మణ్యం, ఎంఈఓ-2 సుప్రియ, ప్రధానోపాధ్యాయులతో కలిసి ఘనంగా సన్మానించి విద్యా ర్థులకు షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మండలంలో సైదాపురం, కలిచేడు రెండు సెంటర్లకు గాను 218 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా వారిలో 172 మంది విద్యార్థులు పాస్ అవడం జరిగిందని, దీంతో 79శాతం ఉత్తీర్ణత వచ్చిందని తెలిపారు. గిద్దలూరు గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు కే.సైలస్ 567 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడని, అనంతమడుగు హైస్కూల్ విద్యార్థి ఎస్.రాజా 553 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాడని, అదే విధంగా గిద్దలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి బి.పల్లవి 552, తురిమెర్ల హైస్కూల్ పి.అర్చన 552 మార్కులు సాధించి వీరిద్దరూ తృతీయ స్థానంలో నిలిచారని ఎంఈఓ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. వీరితో పాటు 500 మార్కులు పైన సాధించిన 21 మంది విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించి అభినందనలు తెలియజేయడం జరిగిందని ఆయన అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన నలుగురు విద్యార్థులకు పొక్కందల గ్రామానికి శ్రీనివాస్‌చౌదరి ఒక్కో విద్యార్థికి రూ.2500 చొప్పున రూ.10వేలు బహుకరించారని ఎంఈఓ తెలిపారు.ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రభంజనం

**నారా లోకేష్ సమర్థతకు ఈ ఫలితాలే నిదర్శనం : ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి**



**నెల్లూరు రూరల్ మే 7 ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరి ధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యా ర్థులు పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. నేడు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో 550కి పైగా మార్కులు సాధించిన 32 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా అద్భుత ఫలితాలు సాధించడం ఆనందదాయకమన్నారు. ప్రభుత్వ విద్యపై ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు, విద్యా రంగంలో జరుగుతున్న మార్పులు, ఉపాధ్యాయుల కృషివల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొ న్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన బోధన అందిం చడంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న చర్యలకు ఈ ఫలితాలే నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలు సాధించగలరని ఈఫలితాలు నిరూపించాయని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్న తస్థాయికిచేరు కోవాలనిఆకాంక్షించారు.విద్యార్థులతల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,పార్టీనాయకులు పాల్గొన్నారు.

## వివోఏలకు స్మార్ట్ ఫోన్లు

**- లబ్ధిదారులకు రూ.18 లక్షల చెక్కుల పంపిణీ**



**నెల్లూరు రూరల్ మే 7 ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్లో పేదరిక నిర్మూలన, స్వయం ఉపాధి కార్యక్రమాలకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యా లయంలో గురువారం సాయంత్రం పేదరికని ర్మూలన, స్వయం ఉపాధి ప్రోత్సా హక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిం చబడ్డాయి. ఈ కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వివోఏలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయడంతో పాటు ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన కార్యక్రమం కింద లబ్ధిదారులకు రుణాల చెక్కులను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఎస్.ఈ.ఆర్.పి - డి.ఆర్.డి.ఎ. ద్వారా గ్రామ స్థాయిలో పనిచేస్తున్న వివోఏల సేవలను మరింత సమర్థవంతంగా మార్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఫోన్ల పంపిణీ చేపట్టినట్లు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. పొదుపు సంఘాల సమావేశాల నిర్వహణ, ఆర్థిక లావాదేవీల పర్యవేక్షణ, గ్రామ స్థాయిలో పారదర్శక వ్యవస్థ బలోపేతానికి ఈ స్మార్ట్ ఫోన్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 23 మంది వివోఏలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. అలాగే ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన కార్యక్రమం కింద నెల్లూరు రూరల్ మండల పరిధిలోని 12 మంది లబ్ధిదారులకు స్వయం ఉపాధి కోసం సున్నా వడ్డీ, సబ్సిడీ రుణాల రూపంలో మొత్తం రూ.18 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ పథకాల ద్వారా పేద కుటుంబాలు ఆర్థికంగా ఎదిగి స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పొదుపు సంఘాల సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల టాపర్లను సత్కరించిన కావలి ఎమ్మెల్యే



**కావలి, మే 7 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి అందరి ప్రశంసలు పొందారు. స్థానిక ట్రంక్ రోడ్డులోని సెల్ఫ్ పాయింట్ వద్ద విద్యార్థులు, ఉపా ధ్యాయులు కలిసి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వాగతంపలికారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మంత్రి నారాలోకేష్ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థ ముందుకు సాగుతోందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అదిరోహించాలని పేర్కొన్నారు. చదివిన పాఠశాల ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిదులు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.